01ATP15F_01ATP15F.qxd 15-03-2024 PM 10:49 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 16 మార్చి 2024 పేజీలు : 04


# హిందూపురం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

❖ రెవెన్యూ డివిజన్..రింగ్ రోడ్డు

❖ లిఫ్ట్ ఇరిగేషన్‌తో చిలమత్తూరు చెరువులకు నీరు

❖ పట్టణంలో మౌళిక సదుపాయాలు

❖ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దీపికవేణురెడ్డి హామీ



ప్రణాళిక వివరిస్తున్న దీపిక వేణురెడ్డి

**హిందూపురం, మార్చి 15 ప్రభాతవార్త**

40 ఏళ్లుగా టిడిపి పాలనలో అభివృద్ధికి దూరమైన హిందూపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించినట్లు హిందూపురం అసెంబ్లీ వైసిపి అభ్యర్థి కురుబ దీపిక ఆమె భర్త వైసిపి నేత గుడ్డంపల్లి వేణురెడ్డి ప్రకటించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రభాతవార్త ప్రతినిధితో వారు మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గం ప్రజలు ఈసారి ఎన్నికల ఫలితాల్లో మార్పును కోరుకుంటున్నారని తప్పకుండా వైసిపి ఇక్కడ గెలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా సంక్షేమపథకాలను ప్రజలకు అందించిన జగనన్నే మళ్లీ సిఎం కానున్నారన్నారు. ఒక లోకల్ వ్యక్తి ఎమ్మెల్యేగా గెలుపొందితే హిందూపురాన్ని ఏ విధంగా అబివృద్ధి చేయవచ్చో అన్నది తాము చేసి చూపిస్తామన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో అతిపెద్ద పట్టణమైన హిందూపురంను రెవెన్యూ డివిజన్ చేస్తామని హామి ఇచ్చారు. రెవెన్యూ డివిజన్ చేసే అంశం అధిష్టానం ఇప్పటికే తమకు మాట ఇచ్చిందని వెల్లడించారు. 2014 ఎన్నికల్లో బాలకృష్ణ హిందూపురంలో స్థానికంగా ఇక్కడే నివసిస్తానని క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తానని ప్రజలకు ఇచ్చిన మాట తప్పాడని విమర్శించారు. పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా వున్నా పట్టించుకోలేదని అతను 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను మభ్యపెట్టేందుకు ఒక వాహనం ఇక్కడికితెచ్చి క్యాన్సర్‌టెస్టులు నిర్వహించారని ఎద్దేవాచేశారు. అయితే ఉమ్మడి అనంతపురంజిల్లా ప్రజల కోసం హిందూపురంలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మించేందుకు సంబంధిత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారితో ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో తాము చర్చించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో దీన్నిసాకారం చేస్తామని స్పష్టంచేశారు. ప్రధానంగా చిలమత్తూరు మండలంలో అన్ని చెరువులకు నీటిని నింపాలన్నదే తమ లక్ష్యమన్నారు. హంద్రీనీవా ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించేందుకు సిఎంతో చర్చించి దానిని నెరవేరుస్తామన్నారు. ప్రసిద్ధి చెందిన లేపాక్షిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అక్కడికి వచ్చే వారికి మెరుగైన వసతుల కల్పనకు భవనాల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేస్తామన్నారు. అంతేకాకుండా హిందూపురం పట్టణంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మించేందుకు ప్రాథమికంగా సంబంధిత శాఖ ఇంజనీర్లతో తాము చర్చించడం జరిగిందని వివరించారు. మరోవైపు తూముకుంట చెక్‌పోస్టు నుండి హిందూపురం నియోజకవర్గం వరకు రోడ్డు విస్తరణ పనులు పెండింగ్‌లో వున్నాయని, స్టేట్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి వాటిని పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని రోజుల కిందటే 25 కోట్లతో హిందూపురం పట్టణ అభివృద్ధికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. మరలా జగనన్న ప్రభుత్వం రానున్నందున ఈ నిధులను తెప్పించి అన్ని వార్డుల్లో సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేస్తామన్నారు. చాలా కాలంగా ముస్లిం మైనార్టీలు కోరుతున్న ఉర్దూ కళాశాల ఇక్కడ నెలకొల్పుతామన్నారు. అభివృద్ధి చెందుతున్న హిందూపురం ప్రాంతంలో డబుల్ రిజిస్ట్రేషన్లు, కబ్జాలు చేసి అమాయకులను భయభ్రాంతులకు గురి చేయడం, ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించుకుని తప్పుడు పత్రాలు సృష్టించడం చట్ట విరుద్ధంగా అక్రమ లేఅవుట్లు వేయడం ఇలా ప్రజలను మోసం చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇలాంటి వాటిని చట్ట ప్రకారం అరికట్టి వ్యాపారులు, ఉద్యోగులు, సామాన్యులు, తదితర అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు.

# అనంతలో పరిటాల శ్రీరామ్ మద్దతు దారులు నిరసన

- టిడిపి జిల్లా అధ్యక్షుని ఇల్లు ముట్టడి - ధర్మవరం టికెట్ తమకే ఇవ్వాలని నిరసన - నాకే అన్యాయం జరిగింది.. నేను ఎవరికి చెప్పాలన్న బికె





నిరసన వ్యక్తం చేస్తున్న పరిటాల శ్రీరామ్ మద్దతు దారులు

**అనంతపురం, మార్చి 15 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీలో టికెట్ల పంచాయితీ రోజురోజుకు మలుపులు తిరుగుతోంది. అక్కడక్కడ తెలుగు తమ్ముళ్లు తిరుగుబాటులకు దిగుతున్నారు. పార్టీ అధిష్టాన వర్గాన్ని ధిక్కరిస్తున్నారు. శుక్రవారం ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మద్దతు దారులు నిరసనకు దిగారు. అనంతపురం నగరంలోని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి ఇంటిని ముట్టడించి ధర్మవరం టికెట్టు తెలుగుదేశం పార్టీ తరపున పరిటాల శ్రీ రామ్‌కే ఇవ్వాలని నిరసనలు చేశారు. శ్రీరామ్‌కు టికెట్ ప్రకటించే వరకు ఇక్కడ నిరసనకు దిగుతామని ధర్మవరం ప్రాతానికి చెందిన టిడిపి మద్దతు దారులు మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారది వద్ద బైఠాయింపు చేశారు. కష్ట కాలంలో శ్రీరామ్ మాకు అండగా ఉన్నారన్న టిడిపి నాయకులు, బిజెపినేత సూరి ఏరోజు తమను పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వ్యక్తికి టికెట్ ఇస్తే మా పరిస్థితి ఏంటని టిడిపి కార్యకర్తలు నిలదీశారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారధి కార్యకర్తలతో మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి పరిస్థితిని మీ దృష్టికి తెచ్చానని వివరించారు. ఇక్కడ ఆందోళన చేస్తే ఎలా అని బికె పార్థసారధి ప్రశ్నించారు. నాకు కూడా అన్యాయం జరిగింది నేను ఎవరికి చెప్పాలంటూ ఓ సందర్భంలో బికె.పార్థసారధి అభిప్రాయ పడ్డారు. మీ సమస్యను పార్టీ అధ్యక్షుడి దృష్టికి విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన సర్దు మణజిగింది. ఇదిలా ఉండగా గురువారం నుంచి ధర్మవరం బిజెపి టికెట్ తమకే లభిస్తుందని ధీమాతో ఎ న్డీఏ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ హంగామా ఎన్నికల ప్రచారానికి దిగడం గమనించ దగ్గ విషయం.

**అనంతపురం అర్బన్ సీటు తమకే కావాలని జనసేన పట్టు :**

అనంతపురం అర్బన్ సీటు పొత్తులో భాగంగా జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్‌కి ఇవ్వాలని జనసేన కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం అనంతపురం మిగతా 3 లో...

# మాజీ మంత్రి గుమ్మనూరు పట్ల తీవ్ర అసంతృప్తి

- నియోజకవర్గంలో ఏకమవుతున్న టిడిపి ఆశావాహులు





గుత్తికోట ఫైల్‌ఫోటో, మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం (ఫైల్‌ఫోటో)

**గుత్తి, మార్చి 15 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ అధిష్టానం పట్ల పత్రికల్లో ప్రచురించడానికి వీలుకాని భాషాజాల ప్రయోగంపై తీవ్ర విమర్శలు గుప్పించిన, వైకాపా మాజీ మంత్రి, ప్రస్తుతం టిడిపిలో చేరిన గుమ్మనూరు జయరాం గుంతకల్లు నియోజకవర్గం సీటు ఆశించడం పట్ల పార్టీ వర్గాల్లో తీవ్రస్థాయిలో అసంతృప్తి పెల్లుబుకుతోంది. బెంజ్ మంత్రి, పేకాట మంత్రి, ఒక కంపెనీకి కేటాయించిన 200 ఎకరాలు తన కుటుంబీకుల పేరుపై కబ్జా చేసిన మంత్రి అంటూ గతంలో రాష్ట్రస్థాయిలో టిడిపి నేతలు విమర్శించారు. ఈ మేరకు ఆయన వ్యవహారశైలి పట్ల తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేరును రెడ్‌బుక్‌లో నోట్ చేసుకున్నామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించిన నేపథ్యంలో జయరాంకు ఈ రీతిన ప్రాధాన్యత కల్పిస్తారని తేదేపా వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఒకవైపు ఐవిఆర్ సర్వే చేపట్టడంతో పాటు ప్రసార మాధ్యమాల్లో జయరాం తాను తెలుగుదేశం అభ్యర్థిగా ప్రకటించుకోవడంతో పార్టీ వర్గాల్లో మింగుడుపడడంలేదు. 2019 నుండి ప్రతిపక్షంలో వుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నియోజకవర్గం ఇన్‌చార్జ్ జితేంద్రగౌడ్, పిజెఆర్ ట్రస్ట్ చైర్మన్ పెరుమాళ్ల జీవానందరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్, పార్టీ డాక్టర్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందుతో పాటు పలువురు తటస్తులు అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా జయరాం పేరు తెరపైకి రావడంతో ఆశావాహులకు మింగుడుపడడంలేదు. పార్టీ అధినేత ప్రకటించకముందే తనకు తాను అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకుని తన సోదరుడు ఆలూరు మార్కెట్‌యార్డుచైర్మన్ గుమ్మనూరు నారాయణను గుత్తి, గుంత కల్లు, పామిడి మండలాల్లో తిప్పడం పట్ల పార్టీ వర్గీయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఆయన సైతం కేవలం వాల్మీకి వర్గాలను ప్రసన్నం చేసుకునేందుకు పరిమితం కావడంతో మిగిలిన బిసివర్గాలు మండిపడుతున్నాయి. ఇటీవల కాలంలో పెనుకొండలో జరిగిన శంఖారావం కార్యక్రమంలో నారా లోకేష్ వలస పక్షుల గురించి ప్రస్ఫుటంగా వ్యాఖ్యలు చేశారు. కళ్యాణదుర్గంలో చెత్తగా పరిణమించిన మంత్రి ఉషాశ్రీచరణ్ పెనుకొండలో పోటీ చేయడం పట్ల ఆయన ఆక్షేపించారు. ఇక్కడ చెత్త ఉత్తమమా అంటూ పెనుకొండ సభలో ప్రశ్నించారు. ఆ వ్యాఖ్యలను టిడిపి కార్యకర్తలు ఉటంకిస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్నూల్ జిల్లా ఆలూరులో వైకాపాకు చెత్తగా పరిణమించిన మంత్రి అనంతపురం జిల్లాలో ఉత్తమునిగా మారిపోయాడా అంటూ స్థానిక టిడిపిశ్రేణులు గర్హిస్తున్నాయి. తమ అధినేతతో పాటు లోకేష్ బాబు పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన జయరాంను ఏరకంగా సమర్థిస్తున్నారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్షంలో వుండగా కార్యకర్తల సంక్షేమం, పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన స్థానిక నియోజకవర్గం నేతలను కాదని స్థానికేతరులకు ఏవిధంగా ప్రాధాన్యత కల్పిస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా వుండగా మరోవైపు వైకాపా నేతలు జయరాం పట్ల తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

యువగళం, శంఖారా వం పేరిట కార్యక్రమాలు నిర్వహించిన నారా లోకేష్ ప్రస్తుతం తాను నమోదు చేసుకున్న రెడ్ బుక్‌లో జయరాం పేరు కొట్టివేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. వైకాపాలో వున్న అవినీతి మంత్రి టిడిపిలోకి చేరగానే పునీతుడయ్యాడంటూ వారు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఏది ఏమైనప్పటికి స్థానికేతరునికి ప్రాధాన్యత ఇవ్వడం పట్ల నియోజకవర్గం స్థాయిలో ఆశావాహులతో పాటు మెజార్టీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం ఇప్పటికైనా పునరాలోచించుకుని నియోజకవర్గంలో పార్టీ కోసం కృషి చేసే నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ అభ్యర్థిని గెలిపించి అధినేతగా కానుకగా అందచేస్తామమన్నారు. కాగా పార్టీ అభ్యర్థి ఎవరన్న రెండు మూడు రోజుల్లో తేలనుంది.

# ప్రచార రథంపై సొమ్మసిల్లిన పల్లె సింధూర రెడ్డి



ప్రచార రథంపై సొమ్మసిల్లి పడిపోయిన పల్లె సిధూరరెడ్డి

**పుట్టపర్తి, మార్చి 15 ప్రభాతవార్త**

పుట్టపర్తి టిడిపి అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి శుక్రవారం మండల కేంద్రమైన కొత్తచెరువులో మధ్యహ్నం ప్రచార రథం పై ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి పడిపోయింది. మొదటి రోజు ప్రచారంలో భాగంగా కేశాపురం సరిహద్దులో నుండి ప్రచార రథం పై కొత్తచెరువు చేరుకున్న ఆమె సొమ్మసిల్లి పడిపోవడంతో పక్కనే ఉన్న మామ పల్లె రఘునాథ్‌రెడ్డి సూచన మేరకు భర్త వెంకట కృష్ణకిషోర్ రెడ్డి తన చేతుల మీదకుతీసుకున్నారు. విద్యాసంస్థలు, ఇంటికే పరిమితమైన ఆమె ఒక్కసారిగా ఎన్నికల ప్రచారం చేసి ఎంత తీవ్రతను తట్టుకోలేని స్థితిలో నిరసించి సొమ్మసిల్లినట్లు తెలుస్తున్నది. సొమ్మసిల్లి పడిపోయిన ఆమె కొంతసేపు విశ్రాంతి తీసేకొన్న వెంటనే ప్రచారరథం ఎక్కి బుక్కపట్నం, జానకంపల్లి, కర్ణాటకనాగేపల్లి. పుట్టపర్తి, బ్రాహ్నణపల్లి మీదుగా సూపర్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి సమీపంలో ఉన్న స్వగృహానికి చేరుకున్నారు. సోమ్మసిల్లిన సింధూరరెడ్డి పరిస్థితిని చూపి అక్కడున్న నాయకులు కార్యకర్తలు కొంత అందోనలకు గురైయ్యారు.

# ఇది మహిళా పక్షపాత ప్రభుత్వం

- వైఎస్ఆర్ చేయూతతో.. మారన్నున అక్క చెల్లెమ్మల భవిత





మాట్లాడుతున్న మంత్రి ఉషాశ్రీ చరణ్, కార్యక్రమానికి హాజరైన మహిళలు

**పెనుకొండ, మార్చి 15 ప్రభాతవార్త**

ఇది మహిళా పక్షపాత ప్రభుత్వం అని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్ అన్నారు. శుక్రవారం పెనుకొండ మార్కెట్ యార్డులో వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత జమ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెనుకొండ అర్బన్, రూరల్, రొద్దం, గోరంట్లమండలాలకు చెందిన 11242 మంది మహిళలు రూ.21 కోట్ల 08 లక్షలు ఖాతాల్లో జమా చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో ఎప్పుడూ చూడని విధంగా ముఖ్యమంత్రి జగన్‌ఓహన్‌రెడ్డి మహిళలకు పెద్ద పీట వేశారన్నారు. కులం చూడలేదు, మతం, ప్రాంతం, వర్గం, చివరికి మీరు ఏ పార్టీ అని కూడా చూడకుండా పార్టీకి ఓటు వేయకపోయినా ఆర్హత మాత్రమే ప్రమాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందించారని అన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్.ఆర్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, కాపు నేస్తం, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి, ఈబిసి నేస్తం ఇలా అనేక సంక్షేమ పథకాలు మహిళల కోసమే ప్రవేశ పెట్టారని ఆమె వివరించారు. 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ అక్కా చెల్లెమ్మలకు ప్రతి సంవత్సరం రూ.18750 చొప్పున నాలుగు సంవత్సరాలలో రూ.75వేలు ఆర్థిక సహాయం చేశారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళ పక్షాపాత ప్రభుత్వం అని అక్క చెల్లెమ్మలకు విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కల్పించాలని తపిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మహిళలతో మమేకమై జగనన్న అందించిన సంక్షేమ పథకాల గురించి వారు పొందిన లబ్ధి గురించి వారి మాటల్లో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్ఆర్ చేయూత మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండల ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందిస్తున్న మంత్రి ఉషాశ్రీ చరణ్

# మహిళా సంక్షేమం, అభ్యుదయం, రక్షణ చంద్రబాబు పాలనలోనే సాధ్యం

- కళ్యాణదుర్గం అభ్యర్థి సురేంద్రబాబు క్యాంపు కార్యాలయంలో పెద్దఎత్తున మహిళాశక్తి సమావేశం
- ముఖ్యఅతిథిగా హాజరైన టిడిపి ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు పొడపాటి తేజస్వని







టిడిపి మహిళాశక్తి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న టిడిపి ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు పొడపాటి తేజస్వని, సమావేశంలో ప్రసంగిస్తున్న అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, మహిళాశక్తి కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ప్రజాప్రతినిధులు

**కళ్యాణదుర్గం, మార్చి 15 ప్రభాతవార్త**

ఎక్కడ మహిళ పూజించబడతారో అక్కడ సుఖశాంతులు ఉంటాయన్నది ఆర్యోక్తి, అయితే వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో మహిళలకు రక్షణలేని పరిస్థితులు నెలకొన్నాయని, రాష్ట్రం 30వేల మంది మహిళలు అదృశ్యం అయ్యారని, తెలుగుదేశంపార్టీ పాలనలోనే మహిళలకు సంక్షేమం, సంరక్షణ, అభ్యుదయం, రక్షణ సాధ్యమని, మహిళల కోసరే చంద్రబాబునాయుడు మహిళాశక్తి పథకాలు అమలు చేస్తున్నారని, కనుక రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని టిడిపి ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు పొడపాటి తేజస్విణి పేర్కొన్నారు. శుక్రవారం టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళాశక్తి కార్యక్రమానికి మాజీ ఎంపిపి అమరావతి మానస వాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గవ్యాప్తంగా తరలి వచ్చిన మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపిపిలు, మాజీ జడ్‌పిటిసిలు, మహిళా ప్రతినిధులు పాల్గొనగా, నియోజకవర్గవ్యాప్తంగా తెలుగుమహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి తేజస్వణి ప్రసంగిస్తూ గతంలో అడపిల్ల పుడితేనే బరువు అనుకుని పదవ తరగతి చదువు పూర్తికాగానే పెళ్లి చేసి పంపేవారని, అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక మహిళలను విద్యావంతులను చేసి, మిగతా 4 లో...



మహిళాశక్తి కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ మహిళలు

# పల్లె సింధూరకు తెదేపా శ్రేణుల అపూర్వస్వాగతం

- అట్టహాసంగా ఎన్నికల ప్రచారం ప్రారంభం

**శ్రీసత్యసాయి జిల్లా, మార్చి 15, ప్రభాతవార్త ప్రతినిధి:**

పుట్టపర్తి నియోజకవర్గ తెదేపా అభ్యర్థిగా టికెట్ దక్కించుకున్న పల్లె సింధూర తన కుటుంబ సభ్యులైన తన మామ మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, తన భర్త పల్లె క్రిష్ణకిషోర్ రెడ్డిలతో కలసి కొత్తచెరువు మండలం కేశాపురం గ్రామంలో వెలసిన పెద్దమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత ఆమె అనంతపురంలోని తన స్వగృహంలో తన తల్లిదండ్రులు శంకర్ రెడ్డి, సౌభాగ్యరాణి మరియు మామ పల్లె రఘునాథ్ రెడ్డిల ఆశీస్సులు అందుకొని ప్రసన్నాయపల్లిలో ఉన్న అత్త కీ॥శే॥ పల్లె ఉమా సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించి, అక్కడి నుండి భారీ కాన్వాయ్‌తో కేశాపురంకు చేరుకున్నారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి కొడపగానిపల్లి గ్రామం వద్దకు రాగానే పల్లె సింధూర, పల్లె క్రిష్ణకిషోర్ రెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డిలకు ప్రత్యేక క్రేన్ ద్వారా ఏర్పాటు చేసిన గజమాలతో పూలవర్షం కురిపిస్తూ తెదేపా శ్రేణులు అపూర్వ స్వాగతం పలికాయి. కొడపగా నిపల్లి నుండి మైలేపల్లి, కొత్తచెరువు ధర్మవరం రహదారిలోని అంబేద్క ర్ విగ్రహం, సర్కిల్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం, బుక్కట్నం రహదారిలోని వాల్మీకి విగ్రహంలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం అక్కడి నుండి బుక్కపట్నం, జానకంపల్లి మీదుగా కర్ణాటక నాగేపల్లి, సత్యమ్మదేవాలయం, గోపురం గేట్, ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా పుట్టపర్తి గణేష్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ కొనసాగించారు. అటు నుండి బ్రాహ్మణపల్లి మీదుగా ర్యాలీ నిర్వహించుకుంటూ శ్రీసత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రివద్ద ఉన్న సొంతగృహానికి చేరుకున్నారు. ఈసందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ తన కుటుంబంపై ఎంతో నమ్మకంతో తన కోడలు పల్లె సింధూరకు టికెట్ ఇచ్చినందుకు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పుట్టపర్తి నియోజకవర్గం ప్రజల చలువ వల్లే తమ కుటుంబానికి ఇంతటి ఆదరణ, కీర్తి ప్రతిష్టలు వచ్చాయని, ఈ ప్రాంత ప్రజల ఆదరాభిమానాలు మరచిపోలేనివన్నారు. తన చివరి శ్వాస ఉన్నంత వరకు ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. తెదేపాకు వస్తున్న జనాదరణ చూస్తుంటే రానున్న ఎన్నికల్లో 175 స్థానాలు కూడా తెదేపా కైవసం చేసుకుంటుదన్న ధీమాను వ్యక్తమౌతోందన్నారు. ఇప్పటికే జగన్ గుండెల్లో రైళ్ళు పరిగెడుతుంటాయని పల్లె వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగురవేసి చంద్రబాబుకు పుట్టపర్తి విజయం కానుకగా ఇస్తామన్నారు. టికెట్ దక్కించుకొని తొలిసారి ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన పల్లె కుటుంబ సభ్యులకు తెదేపా శ్రేణులు ఆయా గ్రామాలు, మండల కేంద్రాల్లో భారీ ఎత్తున బాణాసంచా పేల్చి, పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికాయి.



పల్లె సింధూర, పల్లె కుటుంబ సభ్యులకు ఘనస్వాగతం పలుకుతున్న తెదేపా శ్రేణులు

## మండలంలో పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్న మెట్టు గోవిందరెడ్డి...

డి.హీరేహాళ్, మార్చి 15 ప్రభాతవార్త:



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

మండలంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల వివాహ కార్యక్రమాల్లో నియోజకవర్గం సమన్వయకర్త, వైకాపా అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి శుక్రవారం పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని వైసీపీ నాయకుడు రామిరెడ్డి కుమారుడు వివాహం కార్యక్రమంలోను మరియు నాగలాపురం గ్రామ వైసీపీ నాయకుడు బి.వన్నూరుస్వామి కుమారుడి వివాహం కార్యక్రమంలోను, హీరేహాళ్ గ్రామంలోని వైసీపీ నాయకుడు బి.వెంకటేశ్ సోదరుడు కుమారుడు వివాహ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల మార్కెట్‌యార్డు ఛైర్మెన్ బోజరాజన్‌నాయక్, వైసీపీ కన్వీనర్ ఎం.వన్నూరుస్వామి, జిల్లా స్టీరింగ్ కమిటి సభ్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచులు సుదర్శన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, పార్టీ నాయకులు రహంతుల్లా, గొల్ల సురేష్, గన్నిగౌడ, శివకుమార్, గంగిరెడ్డి, నల్లబండ్ల వంద్రప్ప, రవికుమార్, శివారెడ్డి, హనుమంతరెడ్డి, తిమ్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం కాంట్రాక్టర్‌ను కలిసిన వైకాపా శ్రేణులు..

డి.హీరేహాళ్, మార్చి 15 ప్రభాతవార్త:



శ్రీ రామిరెడ్డి కాంట్రాక్టర్ అనిల్‌రెడ్డిని కలిసిన వైకాపా శ్రేణులు

మండల పరిధిలోని శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం కాంట్రాక్టర్ అనిల్‌రెడ్డిని వైకాపా కన్వీనర్ ఎం.వన్నూరుస్వామి, మండల వైసీపీ నాయకుడు గొల్ల సురేష్ తదితరులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న శ్రీరామిరెడ్డి త్రాగునీటి పనుల పైపులైన్‌ను త్వరగా పూర్తి చేసి వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు కృషి చేయాలని కోరారు.

## పండ్ల తోటల పరిశీలన

శెట్టూరు, మార్చి 15 ప్రభాతవార్త



పండ్ల తోటలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి

బచ్చే హళ్లి గ్రామంలో రాష్ట్ర స్థాయి అధికారి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎస్.రత్నాచార్యులు జిల్లా ఉద్యాన అధికారి బి.ఎం.వి. నరసింహారావు, రేకుల కుంట హార్టికల్చర్ అధికారి దత్తరెడ్డి పండ్ల తోటలను పరిశీలించడం జరిగింది. శుక్రవారం వారు మామిడి పంటను పరిశీలించడం జరిగింది. ఇందులో పిందె రాలడానికి క ఆరణాలను, తేనెమంచు పురుగు, బ్యాక్టీరియల్ తెగులుపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అని రైతులకు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి కంబదూరు గౌసియా హార్టికల్చర్ అధికారి, రాప్తాడు హార్టికల్చర్ అధికారి రత్నకుమార్, హైడ్రోలాగిస్ట్ మంజునాథ్, ఆర్‌బికె సిబ్బంది, ఎఫ్ ఎకాలజీ సంస్థ నుంచి ఎస్ఎడిఎల్ కోఆర్డినేటర్ రుద్రయ్యలు, ఎంటిఎల్ అరుణ్‌కుమార్, సిబిటి అసోషియేట్ లక్ష్మన్న, అగ్రికల్చర్ అసోషియేట్ అజయ్, ఎస్టిటి గంగాభవాని, గ్రామం నుంచి సర్పంచు అతావుల్లా, 24 మంది పండ్ల తోటల రైతులు హాజరయ్యారు.

## విద్యార్థి బానుప్రకాష్‌కు అండగా ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్..

- బాధిత విద్యార్థికి బద్దేనాయక్ చేతుల మీదుగా రూ.20వేలు ఆర్థిక సాయం

శెట్టూరు, మార్చి 15 ప్రభాతవార్త



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

విద్యార్థి భానుప్రకాష్‌కు అండగా ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ అండగా నిలిచారు. శుక్రవారం శెట్టూరు మండల యాటకల్లు గ్రామానికి చెందిన తలారి శిల్పమ్మ, తలారి నాగరాజు పెద్దకుమారుడు భాను ప్రకాష్ ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి భాను ప్రకాష్‌ను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. వివరాల్లోకి వెళ్లే.. యాటకల్లు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న భానుప్రకాష్ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఈ క్రమంలో విద్యార్థికి వెన్నముఖ దెబ్బతింది. ఆసుపత్రిలో చికిత్స చేయించగా ఆపరేషన్ చేస్తే కోలుకుంటారని డాక్టర్లు చెప్పారని తల్లి దండ్రులు అప్పులు చేసి ఆపరేషన్ చేయించుకున్నారు. అయితే ప్రస్తుతం మందులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని మిత్రుల ద్వారా ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన వారికి ట్రస్ట్ ద్వారా రూ.20వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు ఈరన్న, ఉపాధ్యాయులు ఫణీంద్ర, ట్రస్టు సభ్యులు సురేష్, తిప్పేస్వామి, లోకేష్, మహలింగ తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టు రికార్డులను పరిశీలిస్తున్న యస్ఐ పరశురాముడు

బ్రహ్మసముద్రం మార్చి 15 ప్రభాతవార్త,



చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న దృశ్యం

మండంలోని ఎరడికెర చెక్‌పోస్టులోని రికార్డులను తనిఖీచేసిన యస్ఐ పరశురాముడు సిబ్బందితో మాట్లాడుతూ చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ నిర్వహించే సమయంలో వీడివోలు తీస్తూ వాహనాలను చెక్‌చేయాలని అన్నారు. కర్నాటకా మధ్యం అరికట్టడంలో ప్రదానపాత్రపోషించాలని మధ్యం అక్రమంగా తరలించకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

## నేడు ఇంటింటికి మెట్టు...

గుమ్మఘట్ట, మార్చి 15 ప్రభాతవార్త:

మండలంలోని బేలోడు గ్రామ పంచాయితీలో నేడు(శనివారం)ఉదయం 6గంటలకు ఇంటి ఇంటికి మెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి కుమారుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి హాజరువుతున్నారని వైకాపా మండల కన్వీనర్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అద్యక్షులు గౌని లక్ష్మీకాంతరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున మండలంలోని జడ్పిటిసి, ఎంపిపి, వైస్ ఎంపిపిలు, అన్నిగ్రామాలసర్పంచులు, ఎంపిటిసిలు, ప్రతి గ్రామంలోని వార్డు మెంబర్లు, మండలంలోని ముఖ్య నాయకుడు, అన్ని అనుబంధ విభాగాల సభ్యులు, కోఆప్షన్‌మెంబర్లు, సచివాలయకన్వీనర్లు, గృహసారతులు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, విద్యాకమిటి ఛైర్మెన్లు, కార్యకర్తలు, అభిమానులు ప్రతిఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## సచివాలయాలతోనే ప్రజల వద్దకు పథకాలు... మెట్టు

బొమ్మనహాళ్, మార్చి 15 ప్రభాతవార్త:



సచివాలయంను ప్రారంభిస్తున్న మెట్టు గోవిందరెడ్డి..

రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతోనే ప్రజల వద్దకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని నియోజకవర్గం సమన్వయకర్త, వైకాపా అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఉంతకల్లు, బొల్లనగుడ్డం, గోవిందవాడ, దర్గాహోన్నూరు గ్రామాల్లో సచివాలయ భవనాలు మరియు ఏళంజి గ్రామలో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు తమ తమ ఇంటి వద్దకే అందుతున్నాయన్నారు. ప్రజల మేలు కోసం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా ప్రజలకు అందిస్తున్నాడని, ఇలాంటి ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేడన్నారు. అదే విధంగా విద్యా దీవెన, వసతి దీవెన, నాడు-నేడు, వైయస్ఆర్ ఆసరా, ఆరోగ్య శ్రీ తదితర సంక్షేమ పథకాలను అమలుచేసిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇలాంటి పథకాలు అమలు కావాలన్న, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్న మరో సారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు. ప్రజల అందరూ వైకాపా ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పద్మాచంద్రశేఖర్‌రెడ్డి, జడ్పిటిసి నీలవేణి, వైకాపా మండల కన్వీనర్ రామాంజినేయులు, మాజీ మండల కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, వైకాపా నాయకులు రాజుకుమార్, లోకేష్, పరమేశ్వర, పయ్యావుల సత్యన్న, కోటిరెడ్డి, రామక్రిష్ణ, ఆనంద్‌రెడ్డి, గాధిలింగ, జయరామిరెడ్డి, లాలుసాబ్ తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం.... కాలవ భరత్

రాయదుర్గం రూరల్, మార్చి 15 ప్రభాతవార్త:



ప్రచారం నిర్వహిస్తున్న కాలవ భరత్....

రాష్ట్రా బివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమౌతుందని రాయదుర్గం తెలుగు దేశం పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలో టి.వీరాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సైకో పరిపాలన కొనసాగుతోందని, రాష్ట్రంలో అరాచక పాలన చేస్తూ రైతులను, కూలీలను, మహిళలను నట్టేట ముంచుతున్నారన్నారని, అన్ని రంగాల్లో అధిక ధరలు పెంచి మధ్యతరగతి, దిగువ తరగతి కుటుంబాన్ని నట్టేట ముంచుతున్నారని, ఇంటింటికి తిరుగుతూ ఓర్లను అభ్యర్థించారు. ఈ పరిపాలనను పారద్రోలి రాష్ట్రం బాగుపడే విధంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నడు వయస్సు కూడా లెక్కచేయకుండా శ్రమిస్తున్న యోధుడు నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేయాలంటే సైకిల్ గుర్తుకు ఓటువేయాలని, అలాగే రాయదుర్గం తెలుగుదేశం అభ్యర్థిగా ఉన్న మానాన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాయదుర్గం ఎంతగానో అభివృద్ధి చెందిందని, ఈ ఐదేళ్ల వైకాపా పాలనలో అభివృద్ధి కుంటు పడిందని ఆయన విమర్శించారు. మరలా తెలుగుదేశం పార్టీ అధికారం చేపడితే రాయదుర్గం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని దీనికి ప్రతిక్కరు సహకరించి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎంఆర్ఎఫ్ హనుమంతు, క్లస్టర్ ఇన్‌చార్జ్ సిద్దప్ప, మాజీ ఎంపిటిసిలు పురుషోత్తం, హనుమంతు, గ్రామదట్ల సర్పంచ్ రాజశేకర్, జుంజురాంపల్లి సర్పంచ్ వన్నూరుస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు సోమశేఖర్, హేమ్లానాయక్, బోజరాజు, సుంకన్న, తదితర తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిరక్షణ చట్టం ఓ వజ్రాయుద్ధం...

గుమ్మఘట్ట, మార్చి 15 ప్రభాతవార్త:



సమావేశంలో మాట్లాడుతున్న సేవా అవార్డు గ్రహిత చల్లా కిషోర్ చౌదరి

ప్రపంచ వినియో గదారుల దినోత్సవం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ఓ వజ్రాయుద్దమని రాష్ట్ర వినియోగ ఉద్యమసామాజిక సేవా అవార్డు గ్రహిత చల్లా చౌదరి పేర్కొన్నారు. శుక్రవవారం అనంతపురం జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక చల్లాకాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం తీమ్, వినియోగదారుల కోసం సరసమైన మరియు బాధ్యత కోసం ఏ1 అన్ననినాదం 2024అమెరికాలో 1962లో జాన్ ఎఫ్ కెనడి ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు ఈ చట్టంను అమలు లోకి తెచ్చారన్నారు. వస్తువులు కొనే వారు వినియోగదారుడు అని, వినియో గదారుడు తయారు చేసిన వస్తువులు నాణ్యత లేకపోతే, కల్తీ ఉంటే ఈ చట్టం ఉపయోగంగా ఉందని మ్యాన్ ఫాక్చర్ తేదీ, ఎక్స్‌పైర్‌తేదీ, రిటైల్ ప్రైస్‌ను తప్పకుండా చూడాలని, తప్పకుండ రసీదు పొందాలని, ఏదైనా తూకల్లో, కల్తీ, మోసాలు జరిగితే చట్టంను ఆశ్రయించాలన్నారు. అందులో నూతనంగా 2019 చట్టం అమల్లోనికి వచ్చిందని, ఆన్‌లైన్ మోసాలు అరికట్టె చట్టం అమేజాన్, ఫ్లిప్‌కార్డు ఫార్సెల్స్‌లో మోసాలు అరికట్టవచ్చుని, ఈచట్టంలో కేసులువేయడానికి, వస్తువులు ఎక్కడకొన్నాఎక్కడైనా వినియోగ దారులు కోర్టులో కేసులువేసే సౌలభ్యం కేంద్రప్రభుత్వం కల్పించిందన్నారు. ఈచట్టలపైన అవగాహన కలిగి ఉండాలని అందులో భాగంగా కళ్యాణదుర్గం, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహిచడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్య గౌరవాద్యక్షులు చల్లా రాజశేఖర్ చౌదరి, సీనియర్ జర్నలిస్టు లింగప్రసాద్, ఆంగ్ల అధ్యాపకులు మల్లికార్జున, పెట్రోల్ బ్యాంక్, లాయర్ ప్రదీప్, ఓబుళరాజు, రోజ్లీ రాజేష్, దిశ ప్రొటెక్షన్ కౌన్సిల్ జిల్లా కార్యదర్శి సెలిన చౌదరి, బాబా, వద్దే సుంకప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడీఓ కార్యాలయంలో పౌష్టికాహార పక్షోత్సవాలు

బ్రహ్మసముద్రం మార్చి 15 ప్రభాతవార్త,



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పౌష్టికాహార పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ పౌష్టికాహార పక్షోత్సవాలు ఈ నెల 9వ తేదినుండి 23వ తేది వరకు పౌష్టికాహార వారోత్సవాలు అన్ని అంగన్‌వాడి కేంద్రాలలో నిర్వహించాలని అంగన్‌వాడి కార్యకర్తలకు సూచించారు. పౌష్టికాహార లోపం గర్భవతులు, పిల్లలకు కలుగకుండా పౌష్టికాహారం అందించాలనిఅన్నారు. ఈకార్యక్రమంలో ఏఓనందకిశోర్, ఎంఈఓ ఓబుళపతి, డాక్టర్ రాజేష్‌కుమార్, సూపర్‌వైజర్‌లు కాసీంబి, అంజినమ్మ పాల్గొన్నారు.

## స్థల వివాదంలో దాడి - బాధితుడు ఫిర్యాదు

హిందూపురం, మార్చి 15 ప్రభాతవార్త

పట్టణంలోని పరిగి రోడ్డు ప్రాంతంలో ప్లాట్ల క్రయ విక్రయాల్లో వివాదం తలెత్తడంతో స్థలయజమాని అతని కొడుకు తనపై దాడి చేసినట్లు బాధితుడు మల్లయ్య శుక్రవారం స్థానిక ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మోహన్ నుండి ప్లాట్ల కొనుగోలు కోసం అడ్వాన్సులు ఇచ్చి అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందని ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయాలని కోరితే మాట్లాడుదాం ఇంటికి రమ్మని పిలిచి తనను కొట్టారని ఆయన ఆరోపించారు. కారకులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. దాడిలో గాయపడిన మల్లయ్య స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు.

## నాలుగో విడత చేయూత కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి తలారి రంగయ్య

బ్రహ్మసముద్రం మార్చి 15 ప్రభాతవార్త,



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపి



అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నాలుగో విడత చేయూత పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి కళ్యాణ దుర్గం సమన్వయకర్త తలారి మాట్లాడుతూ మహిళలు అన్నిరం గాల్లో రాణించాలని మన ప్రియతమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు 45 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళలకు సంవత్సరానికి రూ 18750 అందించాలన్న ఉద్దేశంతో వరుసగా నాలుగో విడత మండల వ్యాప్తంగా 2695 మంది మహిళలకు డబ్బులను మహిళల ఖాతాలలోకి జమాచేసిన జగన్ మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నదే జగన్ ఉద్దేశం అని అన్నారు. మహిళా సంఘాలకు, రుణమాఫీ, పావలావడ్డీ వంటి కార్యక్రమం ద్వారా మహిళలకు అన్నివిధాలా కుటుంబ పోషణ భారంకాకూడదని చేస్తున్న జగన్‌ను 2024 ఎన్నికల్లో అత్యదిక సీట్లతో మళ్ళీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకొనే భాధ్యత ప్రతి ఒక్కరిపై వేందని అన్నారు. అనంతరం మాజి మంత్రి ఎంపి అభ్యర్థి మాట్లాడుతూ మహిళలకు ఇచ్చినమాటప్రకారం చెప్పిన సమయానికి మహిళల ఖాతాలలోకి డబ్బులు జమాచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను మళ్ళీ సీయంను చేసుకొంటే మహిళలకు మరిన్ని పథకాలు అందుతాయని అన్నారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జ్ పైలా నరసింహయ్య మాట్లాడుతూ మహిళలు ఇన్నిచేసిన జగన్ సీయం కావాలంటే కళ్యాణదుర్గం వైసీపి అభ్యర్థి తలారి రంగయ్యను ఎయల్ఏగా, ఎంపి అభ్యర్థి మాలగుండ్ల శంకర్‌నారాయణను ఎంపిగా గెలిపించి జగన్‌కు భహుమతిగా అవదించాలని అన్నారు. అనంతరం ఎరడికెర యస్‌సి కాలనీలో అంబెద్కర్ విగ్రహం ఎర్పాటుకు విగ్రహంను వాతరణచేసిన తలారి రంగయ్య చేతులమీదుగా ఎరడికెర సర్పంచ్ అంజినమ్మ యల్లప్ప అధ్వర్యంలో ఎర్పాటుచేసి విగ్రహ అవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటీసి ప్రభావతి, ఎంపిపి కంభం చంద్రశేకర్‌రెడ్డి, కన్వీనర్ బసవరాజు, పాలబండ్ల చంద్రశేఖర్, ఎంపిటీసి నాగలక్ష్మీ, కోనాపురం గంగాధరప్ప, బోయ తిప్పేస్వామి, చందనాశివాజి, అధికారులు తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

## నేత్రపర్వంగా చంద్రమౌళీశ్వరుడి నాగాభరణ ఉత్సవం

-పాల్గొన్న ఉత్తరాధికారి జగద్గురు కరిబసవరాజేంద్రస్వామి

-ఉత్సవాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తజనం



ఉత్సవ విగ్రహాలవద్ద పూజల్లో పాల్గొన్న మఠం ఉత్తరాధికారి డాక్టరు కరిబసవరాజేంద్ర మహాస్వామి, సహాయ కమీషనర్ కె.చిట్టెమ్మ తదితరులు



నాగాభరణ ఉత్సవ దృశ్యం

ఉరవకొండ, మార్చి 15 ప్రభాతవార్త

పట్టణంలోని ప్రసిద్ద గవిమఠ సంస్థానంలో వెలసిన చంద్రమౌ ళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శోభకృత్ నామ సంవత్సరం పాల్గుణ శుద్ద షష్టి శుక్రవారం రాత్రి నాగాభరణ ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. గవిమఠం ఉత్తరాధికారి జగద్గురు డాక్టరు కరిబసవ రాజేంద్రమహాస్వామి, మఠం సహాయ కమీషనర్ కె.చిట్టెమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో చంద్రమౌ ళీశ్వరుని ఉత్సవమూర్తిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య ఆల యం నుండి తీసుకువచ్చి నాగాభరణ వాహన రథంపై కొలువుదీర్చిన అనంత రం బాణాసంచా పేల్చుతూ ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తజన సందోహం మధ్య ఉత్సవం ఎదురుబసవన్న గుడి వరకు కొనసాగగా అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మఠానికి చేర్చడంతో కార్యక్రమం ముగిసింది. ఉత్సవాన్ని తిలకించడానికి వందలాది మంది భక్తులు తరలిరావడం విశేషంగా చెప్పాలి. కాగా ఈ కార్యక్రమంలో వీరశైవ సంక్షేమ సంఘం నాయకులు బి.పి.వీరప్ప, అమ్మ తొలిదైవం సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంధ సేవా సంస్థ వ్యవస్థాపకులు పాటిల్ రాజశేఖర్, మఠం అర్చకులు విరుపాక్షి, వేదపండితుడు ఒ.కె.పవన్‌స్వామి, మఠంసిబ్బంది నారాయణ స్వామి, మధు వెంకటేష్, రఘు, కరిబసి తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పథకంతో మహిళల జీవితాల్లో వెలుగులు

కంబదూరు, మార్చి 15, ప్రభాతవార్త:



చెక్కును లబ్దిదారులకు పంపిణి చేస్తున్న దృశ్యం

బడుగు, బహీన వర్గాలకు చెందిన పేద మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వైయస్సార్ చేయూత పథకం వారి జీవితాలలో వెలుగులు నింపుతోంది, అనంత రం జిలాలన ఎంపి, కళ్యాణదుర్గం వైకాపా సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. కంబదూరు మండల కేంద్రంలో శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణంలో నాలుగో విడత వైయాస్సార్ చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తలారి రంగయ్య హాజరై లబ్దిదారులకు నాలుగో విడత చేయూత పథకం చెక్కును పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చేయూత పథకం కింద అర్హులైన మహిళలకు సంవత్సరానికి 18750 చొప్పున ఐదు సంవత్సరాల్లో 75000 వేల రూపాయలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఖాతాలలో జమ చేయడం ఒక వరమని తెలియజేశారు. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసిన ఏకైక సీఎం జగనన్న అని అన్నారు. మహిళలకు అన్నిరంగాల్లోకూడా 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళ సాధికారత కోసం కృషి చేస్తూన్నారని చెప్పారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో మాత్రమే మహిళలు గుర్తుకువస్తారని ఏద్దేవ చేశారు. కళ్యాణదుర్గంలో వైసిపిపార్టీ టిడిపికంటే అన్ని విధాల బలంగా ఉందని వచ్చే ఎన్నికల్లో వైకాపా జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో సంక్షేమాలు కొనసాగాలంటే జగనన్నను తిరిగి ముఖ్య మంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు వైసిపి నాయకులు, కార్యర్తలు, అభిమానులు, చేయూత లబ్ధిదారులు పాల్గొన్నారు.



చేయూత కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

## వైఎస్ఆర్ చేయూత నేరుగా మహిళల ఖాతాల్లోకి

-నియోజకవర్గం వైకాపా అభ్యర్థి దీపిక వేణురెడ్డి

లేపాక్షి, మార్చి 15 ప్రభాతవార్త



మాట్లాడుతున్న హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక



మెగా చెక్కు అందచేస్తున్న దృశ్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా శుక్రవారం నేరుగా ఎస్‌సి, ఎస్‌సి, బిసి, మైనార్టీ మహిళల ఖాతాల్లోకి 18,500 రూపాయలు జమ చేయడం జరిగిందని హిందూపురం వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక వేణురెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన లేపాక్షిలో ఆర్‌జిహెచ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వైఎస్ఆర్ చేయూత కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల కన్వీనర్ నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దీపిక వేణురెడ్డి మాట్లాడుతూ లేపాక్షి మండలంలో 3084 మంది మహిళలకు వైఎస్ఆర్ చేయూత కింద 5.78 కోట్ల రూపాయలు విడుదలైందన్నారు 40 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు హిందూపురంలో గెలుస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. నందమూరి బాలకృష్ణ రెండుమార్లు గెలుపొందినా అభివృద్ధి ఏమాత్రం చేయలేదన్నారు. నిరంతరం సినిమా షూటింగ్‌లకు తన కాలాన్ని వెల్లబుచ్చుతున్నట్లు ఆమె ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓడిపోతానని తెలుసుకున్న బాలకృష్ణ 10 సంవత్సరాలుగా ప్రజను పట్టించుకోని బాలకృష్ణ ఇప్పుడు ప్రతి ఇంటా చీరలు పంపిణీ చేస్తున్నారన్నారు. టిడిపి జిమ్మిక్కులు ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బోయశాంతమ్మను గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బానాల శ్రీనివాసరెడ్డి, వైస్‌ఎంపిపి లీలావతి, ఏసి రామిరెడ్డి, ఏపిఎంలు జయచంద్ర, రామకృష్ణ, మండల సమైక్య అధ్యక్షులు శారద, కోశాధికారి ఆదెమ్మ, కో ఆప్షన్ సభ్యుడు బషీర్, ఎంపిటిసి ఆదినారాయణ, నాయకులు చలపతి, జెకె ప్రభాకర్, అశ్వత్తప్ప, ఇర్ఫాన్, ప్రతాప్, శంకర్‌రెడ్డి, గోపాలప్ప, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పోలీసుల కవాతు

చిలమత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన సోమగట్ట, కొడికొండ గ్రామాల్లో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్‌పి ఉత్తర్వుల మేరకు కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల ను కాపాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజల్లో భద్రతకల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈకార్యక్రమంలో హిందూపురం డిఎస్‌పి కంజాక్షన్, హిందూపురం రూరల్ సిఐ ఈరన్న, చిలమత్తూరు ఎస్ఐ గంగాధర్, 131వ బెటాలియన్‌కు చెందిన 70 మంది బిఎస్ఎఫ్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్స్ పంపిణీ



ఎగ్జామ్స్ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న బిజెపి నాయకులు

లేపాక్షి, మార్చి 15 ప్రభాతవార్త

మండల కేంద్రమైన లేపాక్షిలోని ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వివిసి గిరి అధ్యక్షతన బిజెపి మండల అధ్యక్షులు నరసింహమూర్తి ఎగ్జామ్స్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలన్నారు. 10వ తరగతి విద్యార్థి జీవితం కీలక ఘట్టమన్నారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే జీవితంలో ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు నాగభూషణ, బాబు ప్రసాద్, గోవిందరెడ్డి, బిజెపి వార్డు మెంబర్ జి.శంకర్, నాయకులు, కార్యకర్తలు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని వినతి

లేపాక్షి, మార్చి 15 ప్రభాతవార్త



విఆర్ఓకు వినతిపత్రం అందచేస్తున్న ఉపాధి కూలీలు

మండలంలోని కంచిసముద్రం పంచాయతీలో పనిచేస్తున్న ఉపాధి హామి కూలీలకు పెండింగ్ బిల్లుల ను మంజూరు చేయాలని కోరుతూ సిపిఎం మండల నాయకులు ప్రవీణ్‌కుమార్ విఆర్ఓకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఎండలుఅధికంగా వున్నాయని, ఉపాధి పనులుజరుగుతున్నచోట టెంట్లు ఏర్పాటు చేయాలని, ఉపాధి కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందచేయాలని కోరారు. అదేవిధంగా ప్రతి ఉపాధి హామి కూలి పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

## కరపత్రాల విడుదల

హిందూపురం టౌన్, మార్చి 15 ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీ హిందూపురం నియోజకవర్గం సమన్వయకర్త అమానుల్లా ఆధ్వర్యంలో రూపొందించన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ కరపత్రాలను శుక్రవారం ఆ పార్టీ నాయకులు బాలాజీమనోహర్, కెటి శ్రీధర్‌లు ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చలివేంద్రాలు ప్రారంభం

హిందూపురం టౌన్, మార్చి 15 ప్రభాతవార్త

హిందూపురం పట్టణంలోని ఇందిరానగర్, పలణినగర్, చిన్నమార్కెట్ కూడలి వద్ద వైసిపి యువనాయకుడు మనోజ్ (మింటూ) ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు చలివేంద్రాల వద్ద మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో వుంచుకుని పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులు, పట్టణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా వారి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఉదయ్‌కుమార్, రామచంద్రప్ప, శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

03ATP15_03ATP15.qxd 15-03-2024 PM 11:10 Page 1



# పోరాటాలతోనే మహిళలకు సమాన హక్కులు
## - జనవిజ్ఞాన వేదిక నగర గౌరవాధ్యక్షురాలు డా.పి.ప్రసూన

అనంతపురం అర్బన్, మార్చి 15 ప్రభాతవార్త
నేటి సమాజంలో మహిళల అనుభవిస్తున్న హక్కులు పోరాటాలతోనే సాధిం చుకున్నవేనని జన విజ్ఞాన వేదిక నగర గౌరవాధ్య క్షురాలు డాక్టర్ పి.ప్రసూన తెలియజేశారు. జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ, సమత ఆధ్వర్యం లో శుక్రవారం ఆర్ట్స్ కళాశాల మహిళా హాస్టల్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్స వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ.. ఒకప్పుడు మహిళలకు ఎటువంటి హక్కులు ఉండేవి కావని, పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన హక్కులు కావాలని చేసిన పోరాటంలో దాదాపు 146 మంది మహిళలు తమ ప్రాణాల ను కోల్పోయారని అది మార్చి 8న జరగడంతో 1975లో ఐక్య రాజ్య సమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు హేమామలిని, సత్యసాయి కళాశాల తెలుగు అధ్యాపకురాలు యమునా రాణి, సమత జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి, సమతా నాయకురాలు రాధా, లక్ష్మి, శశికళ, రాజ్యలక్ష్మి, జన విజ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షురాలు రామిడిరెడ్డి, నాయకురాలు లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక నగర గౌరవాధ్యక్షు రాలు డా.పి.ప్రసూన



కార్యక్రమానికి హాజరైన మహిళలు

# డాక్టర్ నిర్లక్ష్యంతోనే విద్యార్థిని మృతి : సాకే హరి

అనంతపురం న్యూటౌన్, మార్చి 15 ప్రభాతవార్త
ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ ఆసుపత్రులు నడుపుతూ ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్న డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి డిమాండ్ చేశారు. శనివారం కమలానగర్‌లోని శ్రీనివాస న్యూరో స్పెషాలిటీ ఆసుపత్రిలో డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని అంకిత మృతదేహాన్ని పరిశీలించి మృతురాలి కుటుంబ సభ్యులతో కలిసి డిఎం అండ్ హెచ్ఓ వెంటనే రావాలని డాక్టర్, ఆసుపత్రి లైసెన్సులు రద్దు చయేలాలని నినాదాలు చేశారు. సాకే హరి ఆసు పత్రి ముందు ధర్నా చేపట్టారు. అంకిత మృతికి పూర్తి బాధ్యత డాక్టర్ వెంకట రమణ, డ్యూటీ సిబ్బందే కారణమని వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలని పెద్ద ఎత్తున నినదించారు. సాకే హరి మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రులన్ని డబ్బు సంపాదనే లక్ష్యంగా చేసుకుని పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమా డుతున్నాయని వాపోయారు. డి ఎం అండ్ హెచ్ఓ ఆసుపత్రిని సందర్శించి విద్యార్థిని మృతిపై పలు విషయాలపై డాక్టర్‌ను విచారించి టీమ్ ఆఫ్ డాక్టర్స్‌తో ఎంక్వైరీ చేయించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నా ఆసుపత్రి ముందు చేస్తున్నటువంటి ఆందోళన కార్యక్రమం ఉధృతం అవుతుందని భావించి సిఐలురెడ్డప్ప, ప్రతాప్‌రెడ్డి, క్రాంతి కుమార్ పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సాకే హరి తదితరులు

# ఈ నెల 17న గీతలు చెడిపి పుస్తకావిష్కరణ
## - ఎన్జీఓ హోంలో కార్యక్రమం

అనంతపురం, మార్చి 15 ప్రభాతవార్త బ్యూరో
ప్రముఖ కథ, నవల రచయిత డాక్టర్ శాంతి నారాయణ స్వహస్తాలతో రాసిన గీతలు చెడిపి.. అను కథ సంపుటిని ఈ నెల 17వ తేది ఆదివారం ఉదయం పదిగంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో ఆవిష్కరించను న్నారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అనంతపురం ఎంపి తలారి రంగయ్య, వీక్షణం మాసపత్రిక వ్యవస్థాపకులు ఎన్.వేణు గోపాల్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణ స్వా మి, జనప్రియ కవి ఏలూరు ఎంకన్న,జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులందరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్వహకులు కోరారు.



డాక్టర్ శాంతి నారాయణ

### వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా బండి లలితా కళ్యాణి
### - ఆలూరు సాంబశివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కళ్యాణి

అనంతపురం,మార్చి 15 ప్రభాతవార్త బ్యూరో
వైఎస్ఆర్ సిపి కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లలితా కళ్యాణి వైఎస్ఆర్‌సిపి నియమించింది. జలాలపురం గ్రామానికి చెందిన బండి లలితా కళ్యాణి మొదటి నుంచి వైసీపీలో చురుగ్గా పని చేస్తోంది. రాబోయే రోజుల్లో కూడా పార్టీ కోసం ఎంతో కష్టపడి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకుంటామని ఆమె వెల్లడించారు. తనకు పదవికి రావడానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బండి లలితా కళ్యాణి శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే స్వగృహం వద్ద ఆలూరు సాంబ శివారెడ్డికి స్వయంగా కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సత్కరించారు.



ఆలూరు సాంబశివారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న బండి లలితా కళ్యాణి

# ఎస్పీ ఆదేశాలతో బెలుగుప్పలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు

అనంతపురం, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి
జిల్లా ఎస్పీ కెకె అన్బురాజన్ ఆదేశాల మేరకు బెలుగుప్ప మండల కేంద్రంలో శుక్రవారం కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. బెలుగుప్ప ఎస్సై శివ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులలో, ముఖ్యమైన కాలనీల గుండా ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు సంకల్పించారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసు ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

# ఓటు హక్కుపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలి
## రాప్తాడు నియోజకవర్గ ఈఆర్ఓ వసంత్‌బాబు

అనంతపురం రూరల్, మార్చి 15 ప్రభాతవార్త:
రాప్తాడు నియోజకవర్గంలోని 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకుని వాటీపైన అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఈఆర్ఓ వసంత్‌బాబు,ఏపిఎం నలప్ప తెలిపారు.శుక్రవారం అనంత రూరల్ మండలం పాపంపేట గ్రామంలోని డ్వాక్రా హహిళాలకు స్వీప్ ప్రోగ్రాం నిర్వహించి మహి ళాలకు ఓటు యొక్క ప్రాముఖ్యత గురించి వారికి తెలియజేసి ఓటరుగా ప్రతి ఒక్కరు నమోదు చేసుకుని వాటీపైన అవగాహన కలిగి ఉండి వచ్చే ఎన్నికల్లో ఓటు కలిగిన వారు అందరు ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు డ్వాక్రా మహిళాలకు తెలియజేశారు.అనంతరం గ్రామంలోని పోలింగ్ బూత్‌ల ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,మహిళాలు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై డ్వాక్రా మహిళాలకు అవగాహన కల్పిస్తున్న ఈఆర్ఓ

# కౌన్సిలింగ్ విధానాన్ని అపహాస్యం చేసే ప్రభుత్వ సిఫార్సులు బదిలీలను రద్దు చేయాలలి - యుటిఎఫ్ నేతలు

అనంతపురం న్యూటౌన్, మార్చి 15 ప్రభాతవార్త
ఉపాధ్యాయులు పోరాటాల ద్వారా సాధించుకున్న కౌన్సిలింగ్ విధానాన్ని అపహాస్యం చేస్తూ ప్రభుత్వమే సిఫార్సు బదిలీలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. సిఫార్సు బదిలీలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేంద్రమ్మ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, వివిధ మండలాల నాయకులు విరేశ్వరాచారి మహ్మద్ గౌస్, పవన్‌కుమార్, గంగాధర్, ఆదిశేషయ్య, వెంకటనాయుడు, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నేతలు

# అక్కంపల్లి పంచాయితీ అభివృద్ధికి నిరంతరం కృషి
## - సర్పంచ్ మల్లెల పుష్పావతి లింగమయ్య

అనంతపురం రూరల్, మార్చి 15 ప్రభాతవార్త:
అనంత రూరల్ మండలంలోని అక్కంపల్లి గ్రామ పంచాయితీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని సర్పంచ్ మల్లెల పుష్పావతి లింగమయ్య పేర్కొన్నారు. అనంత రూరల్ మండలం అక్కంపల్లి పంచాయితీలోని ఎన్ఆర్ కాలనీ సమీపంలో సిసి రోడ్డు ఏర్పాటుకు సర్పంచ్,స్థానిక నాయకులతో కలసి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారు మాట్లాడుతూ రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహాయ సహకరాలతో అక్కంపల్లి గ్రామ పంచాయితీలో తారురోడ్డు,సిసిరోడ్లు,డ్రైనేజీ కాలువలు ఇలా అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు.ఎన్ఆర్ కాలనీ నుంచి వైఎస్సార్ కాలనీ కిలో మీటరు వరకు సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు.ఈ సిసి రోడ్డును త్వరగా పూర్తి చేసి కాలనీ ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. పంచా యితీ అభివృద్దే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేస్తు ముందుకు సాగడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మల్లెల పుష్పావతి లింగమయ్య.

# ముష్టూరు రమాదేవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైకాపా నాయకులు

అనంతపురం రూరల్, మార్చి 15 ప్రభాతవార్త:
అనంతపురం రూరల్ మండల కందుకూరు గ్రామ పంచాయితీకి చెందిన వైకాపా నాయకుడు లక్ష్మిరెడ్డి భార్య గురువారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె మృతి చెందిన విషయంను పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న రాప్తాడు నియోజక వర్గ వైసిపి సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి,ఎంపిటిసిలు రాగే రేవతి పెద్దప్ప,శారద కొండారెడ్డి,ఉప సర్పంచ్ ఓబిలేసు, స్థానిక నాయకులతో కలిసి మృతురాలు రమాదేవి మృతదేహాని కిపూలమాల వేసినివాళులుఅర్పిం చారు.అనంతరంవారుకుటు ంబసభ్యులను పరామర్శించి,కుటుంబ సభ్యులకు తోపుదుర్తి కుటుంబం, వైకాపా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా కలిపించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సోమశేఖర్‌రెడ్డి,స్థానిక నాయకులు లింగమయ్య,నరసింహరెడ్డి,కార్యరక్తలు తదితరులు పాల్గొన్నారు.



రమాదేవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చందు,వైకాపా నాయకులు.

# ఆలయ ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తుల స్వీకరణ

నార్పల రూరల్, మార్చి 15 ప్రభాతవార్త
మండలంలోని గూగూడు గ్రా మంలో వెలసిన శ్రీకుళ్లాయి స్వామి దేవస్థానం ఆలయ ధర్మ కర్తల మండలి నియామకం కోసం దర ఖాస్తులు స్వీకరిస్తు న్నట్లు ఆలయ ఇఒ ఎస్.శోభా రాణి శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. నూ తన ధర్మకర్తల నియామకం కోసం దేవాదాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఆసక్తి గల వారు 20 రోజుల్లోపు దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ కార్యాలయంలో దరఖాస్తుల చేసుకోవాలని ఇఒ సూచించారు.



ఆలయ ఇఒ శోభారాణి

# అనంతలో పరిటాల శ్రీరామ్ మద్దతు దారులు నిరసన

**మొదటిపేజీ తరువాయి...** నగరంలో జనసేన మహిళ కార్యకర్తలు నాయకులు విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ కోసం ఎంత కష్టపడ్డామని, అనంతపురంలో జనసేన బలంగా ఉందని, ఈ సీటును జనసేనకు వదలాలని డిమాండ్ చేయడం విశేషం. ఒకానొక సమయంలో జనసేన మహిళా కార్యకర్తలు కన్నీళ్లుపెట్టుకొని జరుగుతున్న పరిస్థితులప ఆక్రోశం వెల్లగక్కారు. కాగా రాష్ట్రంలో టిడిపి, జనసేన బిజెపి పొత్తులో భాగంగా జనసేన సీట్లు తగ్గినందున ఆ కోవలో అనంతపురం అర్బన్ సీటు జనసేన రాష్ట్ర శాఖ వదులుకున్నట్లు అనంతపురంలో ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగా అనంతపురం అర్బన్ సీటుకు తెలుగుదేశం పార్టీలో డిమాండ్ ఎక్కువైంది. టిడిపి ఆశావహులందరూ విజయవాడలో మాకేం వేశారు. పార్టీలో ప్రస్తుతం ఉన్న నేతలు ఒకవైపు ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఎన్నికల ఏమిటికైనా సిద్ధం అంటూ ఎ న్నారైలు, కొత్త అభ్యర్థులు కూడా టిడిపి తరపున ప్రయత్నించడం చర్చ నీ అంశంగా మారింది. ఇదిలా ఉండగా గుంతకల్లు శాసనసభ స్థానం టిడిపి టికెట్ విషయం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. టిడిపి టికెట్ మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకి వద్దని గుంతకల్లు నియోజకవర్గ టిడిపి నాయకులు, అసంతృప్తి బాటపడ్డం గమనించ దగ్గ విషయం.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం - జె.సి

తాడిపత్రిఅర్బన్, మార్చి 15 ప్రభాతవార్త
తాడిపత్రి పట్టణంలో శుక్రవారం మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా పలువురు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ సమస్యకు గల కారణాలను తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామి ఇచ్చా రు. ఇలాంటి సమస్యలు రాకూడదంటే రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కి పట్టం కట్టాలని ఆయన ప్రజలను కోరారు. ప్రతి గడపకు తిరుగుతూ యోగక్షేమాలను తెలుసుకుంటూ జె.సి ప్రభాకర్‌రెడ్డి ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో జె.సి అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జె.సి

# పామిడిలో గుమ్మనూరు సోదరుడు నారాయణ విస్తృత పర్యటన
## - స్తబ్ధుగా ఉన్నటువంటి టిడిపి శ్రేణులకు ఆర్థిక భరోసా
## - సేవల్లేవ్.. పార్టీ కార్యక్రాలు లేవు.. టికెట్ రాదని తలచి కనుమరుగైన నాయగణం
## - ఎవరికి వారే యమునా తీరు.. టికెట్‌ను ఆశించి కనుమురుగైన నాయకుల భవిష్యత్తు ప్రశ్నార్థకమేనా..?

పామిడి, మార్చి 15 ప్రభాతవార్త
ఇటీవల టిడిపిలో చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ పామిడిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. టిడిపి నాయగణం తీరు నచ్చక స్తబ్దుగా ఉన్నటువంటి శ్రేణులను నేరుగా కలుస్తున్న గుమ్మనూరు నారాయణ వారికి అండగా ఉంటాం.. అంటూ ఆర్థిక భరోసా కల్పిస్తూనే వారిలో మనో స్థైర్యాన్ని నింపుతూ వారి ఐక్యతకు విశేష కృషి చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కార్మికశాఖ మంత్రిగా ఉన్నటుంటి గుమ్మనూరు జయరాం ఆపార్టీకి తన పదవికి రాజీనామ చేసి చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఈక్రమంలో టిడిపి టికెట్ గుమ్మనూరు జయరాంకు దాదాపుగా ఖరారు అయిందన్న ప్రచారం ముమ్మరంగా జరుగుతుండటంతో ఇప్పటివరకూ తమకే టికెట్ అంటూ ప్రచారం చేసుకున్న నాయకగణమంతా ఒక్కసారిగా కనుమరుగవ్వటం చర్చానీయాంశంగా మారింది. ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబునాయుడు గ్యారెంటీ అంటూ ఇక్కడ టిడిపి ఇన్‌చార్జ్‌కు సంబందం లేకుండా గుంతకల్లు టికెట్ తమకే వసుందని ప్రచారం చేసుకుంటూ ఎవరికి వారు యమునా తీరు అన్న చందంగా వ్యవహరించి కార్యక్ర మాలను చేపట్టిన వెంకటశివుడు యాదవ్, పెరుమాళ్ళ జీవానందరెడ్డి, పత్తి హిమబిందు ఒక్కసారిగా గుమ్మనూరు జయరాం తెరపైకి రావటంతో వారంతా కనుమరు గయ్యారన్నది పలువురి వాధన. సామాజిక సేవే మా లక్ష్యం.. నిరుపేదల అభ్యున్నతికి కృషి చేస్తాం.. నియంతృత్వ పాలకుల కబంద హస్తాల నుండి ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకుందాం.. మన భవిష్యత్తును మనమే తీర్చిదిద్దుకు ందాం.. అంటూ నిత్యం ఎవరికి వారు ప్రజలతో మమేక మైన వెంకటశివు దుయాదవ్, పెరుమాళ్ళ జీవానందరెడ్డి, పత్తి హిమబిందు తమకు టికెట్ రాదని తలచి వారి వారి సేవా కార్యకళాపాలను.. భవిష్యత్తుకు చంద్రబాబు నాయుడు గ్యారెంటీ కార్యక్రమాలను గాలికొదటం ఎంతవరకూ సమంజసమని తమకు టికెట్ కేటాయిస్తే సేవా కార్యకళాపాలు, పార్టీ కార్యక్రమాలు అంటూ మావద్దకు వస్తా_రా.. లేకుంటే మావైపు కన్నెత్తి చూడరా.. అని అటు ప్రజలు ఇటు ఆయానా యకుల అనుచరులు సైతం టీస్టాల్స్ వద్ద గుసగుసలాడుతూ వారిపై మండిపడు తుండటం గమనార్హం. జితేంద్రగౌడ్ మాత్రం నేను ఐదేళ్ళు ఎమ్మెల్యేగా మరో ఐదేళ్ళు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పార్టీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్నామని పార్టీకి నేను అందించిన సేవలను గుర్తించి చంద్ర బాబు నాయుడు నాకే టికెట్ ఖరారు చేస్తారని విశ్వాసాన్ని వ్య క్తం చేస్తూనే పార్టీ కార్యక్రమాలకు శ్రేణులను ఉత్తేజ పరుస్తుండటం కొసమెరుపు. ఇకపోతే జితేంద్రగౌడ్ అనుచరులుగా ఉన్నటువంటి టిడిపి నాయకులు శ్రేణులు జితేంద్రగౌడ్‌కే టికెట్ కేటాయిం చాలని ఆయనకు కాకుండా మరొకరికి టికెట్ కేటాయిస్తు ఓడిస్తామంటూ నియోజకవర్గంలోని మూడు ప్రాంతాల్లో ర్యాలీలు, విలేఖరుల సమావేశాలను ఏర్పాటు చేసి అధిష్టాన వర్గానికి తెలియజేస్తుండటం గమనించదగ్గ విషయం. మారుతున్న రాజకీయ పరిణామాల నేపద్యంలో ఇప్పటికే రాబోవు ఎన్నికల్లో పోటీ చేయనున్న టిడిపి అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసిన చంద్రబాబు నాయుడు ఎన్నికల కమీషన్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసేలోపు గుంతకల్లు అసెంబ్లీ టికెట్‌పై నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించి అభ్యర్థి పేరును ప్రకటిస్తారా.. లేక నామినేషన్ చివరి క్షణం వరకూ కొనసాగిస్తారా.. అన్నది వేచిచూడాల్సిందే.



గుత్తి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మెన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరిని కలిసిన గుమ్మనూరు నారాయణ



టిడిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డిని కలిసిన గుమ్మనూరు నారాయణ.

# పండ్లతోటల పెంపకంలో మెలుకవలు పాటిస్తే అదిక దిగుబడులు సాదించవచ్చు

బుక్కరాయసముద్రం మార్చి 15 ప్రభాతవార్త
పండ్లతోటల పెంపకంలో రైతులు మెలుకవలు పాటిస్తే అదిక దిగుబడులు సాదించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు.శుక్రవారం బుక్కరాయ సముద్రం మండలంలోని బి.కొత్తపల్లి గ్రామంలో బత్తాయి తోటలను రాష్ట్ర ఉద్యాన అదికారి బృందం కమిషనరు కార్యాలయం నుండి ఏడిహెచ్ వెంకట రావు,రేకులకుంట ఉద్యాన పరిశోదన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం పరిశీలించారు.ఈ సందర్బంగ వారు మాట్లడుతూ బత్తాయి పంటల్లో బెట్టసమయంలో పాటించవలసిన యాజమాన్యపద్దతులు తెలియజేశారు. మొక్కల ఆకులు ఇతర చెత్తపదార్థాలు చెట్ల పాదుల్లో పరిచి తేమను కాపా డుకోవాలన్నారు.ఒక్కోచెట్టుకి 100,110 లీటర్ల నీరు అవసరం అని తెలి పారు. చీని,నిమ్మతోటల్లో ఎరువుల యాజమాన్యం కీలకమైనది వేరుకుళ్ళ తెగులు నివారణకు నీళ్ళు పెట్టిన మరుసటి రోజు ఒక శాతం బోర్డు మిశ్రమం లేదాకార్బనిజం రెండుగ్రాములు ఒక లీటరు నీటికి కలిపి 25 లీటర్లచొప్పున ఒక చెట్టుకు చెట్లపాది లో మొత్తం పోయాలి రెండో మందు పోసిన 20 రోజుల తరువాత ట్రైకోడెర్మా 100 గ్రాములు రెండు కిలోల వేపపిండి 25 కిలోల ఎఫ్‌వైఎం ఇవన్నీ కలిపి చెట్టు పాదల్లో జూన్ జూలై ఒకసారి, డిశంబ ర్‌లో మరొకసారి వాడాలన్నారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు బుక్కరా యసముద్రం ఉద్యానశాఖ అధికారి శైలజ,విహెచ్ఏలు శ్రీనివా సులు,నేత్ర, గ్రామ రైతులు తదితిరులు పాల్గొన్నారు.


**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా నాగులదిన్నె మహబూబ్ బాషా, S/o షబ్బీర్ బాషా, 15/1308, సంజీవ నగర్, తాడిపత్రి, అనంతపురం 515411 నందు నివసిస్తున్నారు. నాగులదిన్నె మహబూబ్ బాషా తన ఆస్తిని తాడిపత్రి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, తాడిపత్రి బ్రాంచ్ నందు వారు ప్రాపర్టీని తాకట్టు పెడుతున్నారు. ఈ షెడ్యూల్స్ స్థిరాస్తిపై ఎవరికైనా ఎటువంటి క్లైమ్‌లు, ఆక్షేపణలు ఉన్న ఎడల నేటి నుండి ఏడు రోజుల లోపు క్రింది చిరునామాకు సంప్రదించగలరు.
SCHEDULE OF IMMOVABLE PROPERTY
This Property holder Name : NAGULADINNE MAHABOOB BASHA
SY NO: 80-1, 80-2, Total: 9 Cents
The property is situates in TADIPATRI mandal with the following particulars.
DOC NO: 5581/2020
East: 20 అడుగుల రోడ్డు, South: 103,104,105,106,107,108 నెంబర్లు గల ప్లాట్లు, West : 81 సర్వేనెంబరు గల భూమి, North: 20 అడుగుల రోడ్డు. ఈ మధ్యలో ఉండే ప్లాట్ కొలతలు
C.RAMESHNATHA REDDY (Advocate), THADIPATRI


# చిరుధాన్యాలు, ఆకుకూరలతో సంపూర్ణ ఆరోగ్యం - ఐసిడిఎస్ పిడి

బుక్కరాయసముద్రం, మార్చి 15 ప్రభాతవార్త
చిరుధాన్యాలు ఆకుకూరలతో కూడిన పౌష్ఠకాహారం తీసుకోవడ ంవల్ల రక్తహీనతను జయించడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాదించవచ్చునని ఐసిడిఎస్ పిడి శ్రీదేవి అన్నారు.శుక్రవారం శింగనమల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిది లోని బుక్కరాయసముద్రం మండ లం పరిదిలోని కొట్టాలపల్లి గ్రామంలోని అంగన్వాడి సెంటర్ నందు ఏర్పాటుచేసిన పౌష్ఠికాహార పక్షోత్స వం కార్యక్రమానికి ముఖ్యఅ తిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్బంగ వారు మాట్లడుతూ పౌష్ఠికహారం గురించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వారి తోపాటు సిడిపిఒ ఉమాశంకరమ్మ, సూపవైజరు నాగ మణి,అంగన్వాడి కార్యకర్త యశోదమ్మ,మహిళా పోలీసు, జచివాలయం సిబ్బంది గర్బవతు లు,బాలింతలు పిల్లలు తదితిరులు పాల్గొన్నారు.



ఆరోగ్యసూచనలు ఇస్తున్న ఐసిడిఎస్ పిడి శ్రీదేవి


**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా వనిపెంట మహేశ్వరి W/o ఈశ్వర్‌రెడ్డి, 3/574-53, 3వ వార్డు, తాడిపత్రి, అనంతపురం 515411 నందు నివసిస్తున్నారు. వనిపెంట మహేశ్వరి తన ఆస్తిని తాడిపత్రి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, తాడిపత్రి బ్రాంచ్ నందు వారు ప్రాపర్టీని తాకట్టు పెడుతున్నారు. ఈ షెడ్యూల్స్ స్థిరాస్తిపై ఎవరికైనా ఎటువంటి క్లైమ్‌లు, ఆక్షేపణలు ఉన్న ఎడల నేటి నుండి ఏడు రోజుల లోపు క్రింది చిరునామాకు సంప్రదించగలరు.
SCHEDULE OF IMMOVABLE PROPERTY
This Property holder Name : VANIPENTA MAHESWARI
SY NO: 756, Total: 42 Cents
The property is situates in TADIPATRI mandal with the following particulars.
DOC NO: 204/2006
East: సర్వే నెంబరు గల మా సొంత భూమి 29 సెంట్లు మరియు మాలో 4వ ఇసము యొక్క సొంత సర్వే 755 సర్వేలోని 55 సెంట్లు, , South: బి.సుబ్బరాయుడు గారి భూమి, West : ఈ దినం మేము వనిపెంట ఈశ్వర్‌రెడ్డికి విక్రయించిన భూమి, North: పడమర పబ్లిక్ సంద్యాల రోడ్డు నుండి పై తిప్పనం భూమికి మరియు తూర్పు దిశకు మా సొంత సర్వే 755 సంఖ్యలోని 55 సెంట్లు భూమిక బండ్లు కాండ్లు లారీలు వగైరాలు అడుగుల రోడ్డుపై రాకపోకలు కొనసాగించడానికి 15 అడుగుల రాస్తా. ఈ మధ్యలో ఉండే ప్లాట్ కొలతలు
C.RAMESHNATHA REDDY (Advocate), THADIPATRI


# రజక జాతి ముద్దుబిడ్డ డాక్టర్ పిడుగురాళ్ల మాధవికి టికెట్ కేటాయించడం ఆనందదాయకం
## - రజక సంఘం జిల్లా కార్యదర్శి అవినాస్ చేలురి

అనంతపురం, మార్చి 15 ప్రభాతవార్త బ్యూరో
ఉమ్మడి తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపిలు విడుదలచేసిన రెండో జాబితాలో గుంటూరు పశ్చిమ నుంచి తేదేపా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పిడుగురాళ్ల మాధవిని నియమించడం చాలా ఆనంద దాయకమని రజక సంఘం జిల్లా అధ్యక్షులు అవినాష్ చేలూరి పేర్కొన్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ.. రజక సామాజిక వర్గానికి చెందిన ఆడ పడుచు డాక్టర్‌పిడుగు రాళ్ల మాధవికి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించిన తెలుగుదేశ ంపార్టీ జనసేన పార్టీ, బిజెపి పార్టీల అధ్యక్షులకు నాయకులకు ప్రత్యేకమైన ధన్యవాదములు అలాగే మా రజక జాతి అభివృద్ధి కోసం కృషి చేస్తున్న తేదేపా, జనసేన, బిజెపి పార్టీలకు శిరస్సు వంచి నా హృదయ పూర్వక ధన్యవాదాలు త ఎలియజేస్తున్నాను., అదే విధంగా పిడుగురాళ్ల మాధవి గెలుపుకోసం ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు.



రజక సంఘం జిల్లా కార్యదర్శి అవినాస్ చేలురి

# అమిత్‌షాను కలిసిన గాలి జనార్ధన్‌రెడ్డి

బళ్లారి, మార్చి15, ప్రభాతవార్త; లోక్‌సభ ఎన్ని కలకు రాజకీయ పార్టీలు తమ కార్య కలాపాలను చురుగ్గా ప్రారంభించాయి. ఈ నేప థ్యం లో రాజకీయ వర్గాల్లో ట్విస్ట్ రీతిలో గంగావతి ఎమ్మెల్యే, కేఆర్‌పీ పార్టీ నేత గాలి జనార్ధ న్‌రెడ్డి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను గురువారం భేటీ చేయడం కుతూహలం రేకెత్తించింది. ఈ ఇద్దరి భేటీ కర్ణాటక బీజేపీ శ్రేణుల్లో చర్చనీ యాంశమయ్యింది. తామిద్దరి భేటీపై సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేసిన జనార్ధన్‌రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆహ్వానం మేరకు న్యూఢిల్లీలో కేఆర్‌పీపీ పార్టీ అధ్యక్షుడిగా కలిసి కర్ణాటక రాష్ట్రానికి సంబం ధించి వివిధ అంశాలపై చర్చించినట్లు, చాలా రోజుల తర్వాత తాను సంతోష పడినట్లు ఎక్స్‌లో వ్యక్తం చేశారు. గత సంవత్సరం జరిగిన రాష్ట్ర విధానసభ ఎన్నికల సందర్భంలో బీజేపీ నుంచి జనార్ధన్‌రెడ్డి గంగావతి క్షేత్రం టికెట్ ఆశించారు. అయితే పార్టీ హైకమాండ్ జనార్ధన్‌రెడ్డికి టికెట్‌ను నిరాకరిం చడంతో ఆయన కళ్యాణరాజ్య ప్రగతి పార్టీని స్థాపించారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల సందర్భంలో గాలి జనార్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌కు మద్దతుని చ్చారు. అయితే తాజా గా అమిత్‌షాను భేటీ చేయడం రాష్ట్ర రాజకీయవర్గాల్లో సంచలనం రేకెత్తించింది.



ఢిల్లీలో అమిత్‌షాతో గాలి జనార్ధన్‌రెడ్డి భేటీ అయిన దృశ్యం

# శ్రీ షిర్డీ సాయ సేవా సత్సంగ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

బళ్లారి, మార్చి15, ప్రభాతవార్త; నగరంలోని గ్రహం రోడ్డులో వేసవితా పం పెరుగుతుండడంతో శ్రీ షిర్డీ సాయి సేవా సత్సంగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి వేసవి చలివేంద్రంతో పాటు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని స్థానిక 3వ వార్డు మహా నగరపాలికె సభ్యుడు ఎం.ప్రభంజన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంలో 11వ వార్డు కార్పొరేటర్ ఎన్.గోవిందరాజులు, సత్సంగ్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.గోపాలకృష్ణ, ఉపాధ్య క్షుడు హెచ్.రమేష్, కోశాధికారి కె.గోవిందరాజు, ట్రస్ట్ పదాధికారులు పాల్గొన్నారు.



శ్రీ షిర్డీ సాయి సేవా సత్సంగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన చలివేంద్రం, అల్పాహారశాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రభంజన్‌కుమార్

# చేయి..చేయి కలిపారు..సహచరునికి సాయమందించారు
## - పక్షవాతంతో బాధపడుతున్న సహకచరునికి రూ. 57 వేలు అందజేత

యాడికి, మార్చి 15 ప్రభాతవార్త
మండలంలోని రాయల చెరువు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980-90లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు తమ సహచరుడు పక్షవాతంతో బాధపడుతున్న అబ్దుల్‌రజాక్‌కు 57 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. బాల్యంలో కలిసి మెలిసి తిరిగి చదుకుని కాలక్రమేనా ఒక్కొ క్కరు ఒక్కొక్క రంగంలో స్థిరపడ్డారు. అయితే తమ సహచరుడైన అబ్దుల్ జిలాన్ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ విధి వక్రీకరించి పక్షవాతం బారినపడ్డాడు. అబ్దుల్‌జిలాన్‌తో పాటు విద్యను అభ్యసించిన తోటి విద్యార్థులు ఈ సమాచారాన్ని అందరికి చేరవేసి చేయి చేయి కలిపి ఆర్థి చేయూతను అందించారు. అందరూ పోగుచేసిన సొమ్మును శుక్రవారం రాయలచెరువు గ్రామంలోని మసీదు వీధిలో నివాసం వుంటున్న అబ్దుల్‌రజాక్ కుటుంబానికి అందచేశారు. ఈ సందర్భంగా రజాక్ కుటుంబం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తలిపింది. ఈ కార్యక్రమంలో మహమ్మద్‌రఫీ, పురుషోత్తవ ునాయుడు, బాబా, రంజి త్‌కుమార్, నాని, మోహన్‌రెడ్డి, ఉమేష్ సూరి (ఎరువుల దుకాణం), రమేష్, శ్రీకాంత్, జెపిడి రామాంజి, పక్కీరప్ప, రాంప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్‌రజాక్ కుటుంబానికి నగదు అందచేస్తున్న దృశ్యం

# ఇసుక టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు, రైతులు

యల్లనూరు, మార్చి 15 ప్రభాతవార్త
మండలంలోని తిరుమలాపురం గ్రామం వద్ద చిత్రావతి నదిలో అనుమ తులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుక టిప్పర్లను శుక్రవారం గ్రామస్తులు, రైతులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా వున్నాయి. శుక్రవారం చిత్రావతి నదిలో అనుమతులు లేకుండా టిప్పర్లతో ఇసుక తరలిస్తున్నారని తెలుసుకుని గ్రామంలోని రైతులు మహిళలు నది వద్దకు చేరుకుని అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. ఇక్కడ ఇసుక అంత ఖాళీ అయితే భూగర్భజలాలు అడుగంటి పోతాయని మాకు తాగడానికి కూడా నీరు వుండదని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సిఐ సుబ్ర మణ్యం, ఎస్ఐ గిరిబాబు అక్కడికి చేరుకుని టిప్పర్లను వెనక్కు పంపించారు.



ఇసుక టిప్పర్‌లను అడ్డుకున్న గ్రామస్తులు, రైతులు

